సాక్షి
సూర్యాపేట
సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



కూల్‌డ్రింక్స్ గోదాం దగ్ధం

షార్ట్‌సర్క్యూట్‌తో కూల్‌డ్రింక్స్ గోదాం దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం చివ్వెంల మండలంలో చోటుచేసుకుంది. - 8లో



అడ్డంకులను తొలగించాలి

ఉపాధ్యాయుల బదిలీలకు అడ్డంకులను తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. - 8లో



అభివృద్ధి శూన్యం

హుజూర్‌నగర్ ఎమ్మెల్యే దోచుకోవడం తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. - 10లో

న్యూస్‌రీల్

మట్టపల్లిలో నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకళ్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, శ్రీమూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అష్టోత్తర సహస్ర, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లకు నూతన వధూవరులుగా అలంకరణ ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు, కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న భాగ్యరెడ్డి, నేతలు

నేరేడుచర్ల: బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేస్తూ.. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అన్నారు. ఆదివారం నేరేడుచర్లలో నిర్వహించిన ఆ పార్టీ మండల ప్రవాస్ యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, పార్థనబోయిన విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల ప్రవాస్ యోజన ఇన్‌చార్జి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జల వెంకట్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బాల వెంకటేశ్వర్లు, నాయకులు జూలూరు అశోక్, ఎల్లయ్య, రామ్మూర్తి, రాంరెడ్డి, నాగిరెడ్డి, విజయ్‌రెడ్డి, రాచకొండ శ్రీను, రాజేస్‌రెడ్డి, పవన్, సతీష్, శ్రీను, శ్రవణ్, మట్టయ్య, నారాయణరెడ్డి, సైదిరెడ్డి, సురేష్, సైదులు, దేవిరెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి శ్రీపాద అర్చనాదేవికి 'తానా' ప్రశంసలు



జూమ్‌యాప్‌లో పాల్గొన్న శ్రీపాద అర్చనాదేవి

హుజూర్‌నగర్: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) అంతర్జాతీయ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ కూతుళ్ల దినోత్సవం సందర్భంగా జూమ్ యాప్ ద్వారా నారీ సాహిత్య భేరీ కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో తెలుగు వెలుగు సాహిత్య వేదిక తరఫున సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన కవయిత్రి శ్రీపాద అర్చనాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె యువత మేలుకో అనే కవితా గానం చేశారు. దాదాపు 13 గంటల పాటు సాగిన కార్యక్రమంలో 15 దేశాల నుంచి 108 మంది కవయిత్రులు పాల్గొని వారి కవితా గానాలు వినిపించగా తనకు ప్రశంసాపత్రం లభించినట్లు అర్చనాదేవి తెలిపారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం మెగా డీఎస్సీని నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెగా నోటిఫికేషన్ చేయకుంటే వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5.55లక్షల నిరుద్యోగులు గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం కావడానికి కారణం తెలంగాణ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నవంబర్ లోనే గ్రూప్-2, గ్రూప్-3, డీఏఓ, హాస్టల్ వార్డెన్ పరీక్షలు ఉన్నాయన్నారు. విడివిడిగా నిర్వహించాల్సిన పరీక్షలు ఒకే నెలలో నిర్వహిస్తే నిరుద్యోగులు ఎలా రాస్తారన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు డి.శ్రీనివాస్, బి.గోవిందరావు, నరసింహాచారి, కోటేశ్వరరావు, రామరాజు, ఎం.సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ కావట్లే..!



నిర్మాణంలో ఉన్న కోదాడ- ఖమ్మం రహదారి

- కోదాడలో రహదారి నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కొత్త కష్టాలు
- కొద్ది భూమి సేకరించి సర్వే నంబర్లన్నీ బ్లాక్‌లిస్టులో పెట్టిన అధికారులు
- అమ్మడానికి వీలుకాని మిగతా భూములు
- నిషేధిత జాబితా నుంచి తొలగించాలని అర్జీలు పెట్టుకున్న 14 మంది
- ఏడాదవుతున్నా పరిష్కారం చూపట్లేదని అన్నదాతల ఆవేదన

"అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన రైతు బద్దం అప్పిరెడ్డికి కోదాడ-ఖమ్మం రహదారి వెంట రెండు ఎకరాల భూమి ఉంది. ఖమ్మం-జడ్చర్ల రహదారి నిర్మాణంలో భాగంగా ఆయన భూమిలోంచి అధికారులు 10 గుంటలు సేకరించి నష్టపరిహారం కూడా ఇచ్చారు. కానీ, సదరు భూమి ఉన్న సర్వే నంబర్ మొత్తాన్ని బ్లాక్ లిస్టులో పెట్టారు. దీనివల్ల ఆ రైతు మిగతా భూమి అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్ కావడం లేదు. ఈ విషయమై ఇప్పటికీ ఇద్దరు కలెక్టర్ల వద్దకు 10 సార్లు వెళ్లాడు. నాలుగు సార్లు ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చాడు. ఏడాది అవుతున్నా బ్లాక్ లిస్టులో పెట్టిన తన భూమి ఉన్న సర్వే నంబర్‌ను తొలగించడం లేదని అప్పిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు."

కోదాడ: ఖమ్మం-జడ్చర్ల రహదారి నిర్మాణం కోసం భూములనిచ్చిన రైతులకు మిగతా భూములను అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ కష్టాలు వచ్చి పడ్డాయి. రహదారి నిర్మాణానికి రైతుల నుంచి భూములు సేకరించిన అధికారులు వారిపట్ల ఉదారంగా వ్యవహరించాల్సిందిపోయి ముప్పు తిప్పలు పెడుతున్నారు. రహదారి కోసం గుంట, రెండు గుంటల భూములను సేకరించిన అధికారులు ఆయా సర్వే నంబర్లలోని మొత్తం భూములను బ్లాక్ లిస్టులో పెట్టారు. దీంతో ఆయా సర్వే నంబర్లలో మిగిలిన తమ సొంత భూములను తమ అవసరాల నిమిత్తం అమ్ముకుందామంటే రైతులకు రిజిస్ట్రేషన్ కావట్లేదు. దీంతో ఏడాది నుంచి రెవెన్యూ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అధికారులా.. మజాకా..

కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరబండపాలెం వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం చేశారు. దీని కోసం భూమిని సేకరించిన అధికారులు నష్టపరిహారం లెక్కించడంలో తమ చేతివాటాన్ని కూడా ప్రదర్శించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ్మరకు చెందిన ఒక రైతు భూమిలో అధికారులు రెండు కుంటల భూమిని సేకరించారు. దీనిలో 100 వ్యవసాయ పైపులు ఉన్నట్లు రికార్డులో నమోదు చేశారు. మరో రైతు నుంచి కుంట భూమిని సేకరించారు. దానిలో 60 పైపులు ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు. గుంట భూమి అంటే 120 చదరపు గజాలు ఇంత కొద్ది భూమిలో 60 పైపులు ఎలా ఉంటాయో అధికారులకే తెలియాలి. ఈ వ్యవహారంలో రిటైర్డ్ రెవెన్యూ అధికారితోపాటు గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నేతలు చక్రం తిప్పి జేబులు నింపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై పూర్తి విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రైతుల సమస్య రెండు రోజుల క్రితం నా దృష్టికి వచ్చింది. నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. ఒకటి రెండు రోజుల్లో సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

సూర్యనారాయణ, ఆర్డీఓ, కోదాడ

పరిహారం చెల్లించారు సరే..

ఖమ్మం-జడ్చర్ల రహదారి నిర్మాణంలో భాగంగా కోదాడ నియోజకవర్గ పరిధిలో అధికారులు భూములను సేకరించారు. ఖమ్మం జిల్లా సరిహద్దుగా ఉన్న పాలేరు వంతెన నుంచి 65వ నంబర్ జాతీయ రహదారి వరకు 350 మంది రైతుల నుంచి 110 ఎకరాల భూమిని సేకరించారు. వీరికి ప్రాంతాన్ని బట్టి నష్టపరిహారం చెల్లించారు. ఒక రైతుకు ఉన్న భూమిలో కొంత భాగాన్ని సేకరించిన అధికారులు మొత్తం రైతుల భూములకు చెందిన సర్వే నంబర్లను బ్లాక్‌లిస్టులో పెట్టారు. దీంతో మిగిలిన వారి సొంత భూములను ఇతరులకు అమ్ముకోవడానికి రిజిస్ట్రేషన్ కాని పరిస్థితి నెలకొంది. తమ భూములను బ్లాక్ లిస్టులో నుంచి తొలగించి మా సమస్యను పరిష్కరించాలని సంవత్సరం నుంచి దాదాపు 14మంది వరకు రైతులు కోదాడ ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లో దరఖాస్తులు పెట్టుకున్నారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో రేపు ఫోన్ ఇన్

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యపై మంగళవారం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహించనుంది. మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ డ్రెయిన్‌లు, చెత్త పేరుకుపోవడం, ఓపెన్ ప్లాట్లలో మురుగునీరు నిల్వ ఉండడం తదితర సమస్యలపై మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేది. 26.09.2023 మంగళవారం
ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

డయల్ చేయాల్సిన నంబర్ : 98499 05912



రామానుజులరెడ్డి,
మున్సిపల్ కమిషనర్,
సూర్యాపేట

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు



సూర్యాపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగానే హైకోర్టు గ్రూపు-1 ప్రిలిమ్స్‌ను రద్దు చేసిందని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ అన్నారు. నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్ష రద్దు చేయడం అంటే కేసీఆర్ పాలనకు రోజులు దగ్గర పడడమేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నుంచి ఉద్యోగాల భర్తీ విషయంలో మోస పూరితమైన వైఖరి, నిరుద్యోగుల పట్ల కపటప్రేమ కనబరుస్తోందన్నారు. గతంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తే రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదన్నారు. మళ్లీ రెండో సారి పరీక్షను రద్దు చేయడం ప్రభుత్వ కుట్రేనన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ గోగుల వీరబాబు, పీవైఎల్ జిల్లా నాయకులు ఏర్పుల పరశురామ్, పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోషిమాత, గులాం, సుధాకర్, పీడీఎస్‌యూ నాయకులు శివమణి, యమున, మౌనిక, రాణి, లత తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 33,474 దరఖాస్తులు

- అభ్యంతరాలు, మ్యుటేషన్‌కు మరో 35,893 అర్జీలు
- ముగిసిన ఓటరు జాబితా సవరణ గడువు
- ఇప్పటి వరకు పరిశీలించినవి 30,829

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఓటు హక్కు కోసం అర్హులైన కొత్త వారు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా ఓటు హక్కుకు, ఇతర సవరణలకు మొత్తం 69,367 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. ఇందులో కొత్తగా ఓటు హక్కు కోసం 33,474, అభ్యంతరాలపై 20,965, మార్పులు, చేర్పుల కోసం 14,928 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

పరిశీలన ఇలా..

రెండు నెలల పాటు కొనసాగిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో వచ్చిన 69,367 దరఖాస్తుల్లో 30,829 దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. మరో 38,538 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నాయి. కొత్తగా ఓటరు నమోదుకు 33,474 దరఖాస్తులు రాగా 21,861 దరఖాస్తులను పరిశీలించారు. అభ్యంతరాలపై 20,965 దరఖాస్తులు అందగా 2,200 దరఖాస్తులను పరిశీలించారు. అదేవిధంగా మార్పులు, చేర్పులకు 14,928 దరఖాస్తులు అందగా 6,768 దరఖాస్తులను పరిశీలించారు.

ప్రత్యేక శిబిరాలతో భారీగా..

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై కలెక్టర్ వెంకట్రావు చొరవ చూపి ప్రత్యేక శిబిరాలు నిర్వహించడంతో దరఖాస్తులు భారీ సంఖ్యలో వచ్చాయి. ముఖ్యంగా ఓటర్ల నమోదుపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమాలనూ చేపట్టారు. కళాశాలల్లోనూ ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. నమోదు సమయాల్లో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, అధికారులు పర్యవేక్షించారు.

అందిన దరఖాస్తులు ఇలా..

దరఖాస్తు తీరు	వచ్చిన దరఖాస్తులు	పరిశీలించినవి
ఫారం-6 (ఓటరు నమోదు)	33,474	21,861
ఫారం-7(అభ్యంతరాలు)	20,965	2,200
ఫారం-8 (మ్యుటేషన్)	14,928	6,768

కుల వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వర్‌రావు



వెలిదండలో మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

గరిడేపల్లి: కుల వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయడంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో జరిగిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దళిత, మైనార్టీ, ఆదివాసీ, గిరిజనులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఆత్మగౌరవంగా జీవించేలా చేయడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్, డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, అరుణోదయ జిల్లా కార్యదర్శి ఉదయగిరి, ఐఎఫ్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నవీన్, పీవైఎస్ జిల్లా కార్యదర్శి రవి, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, నాగయ్య, శ్రీను, కనకయ్య, రాజు, మాశెట్టి అంజయ్య పాల్గొన్నారు.

పల్లెలు మెరవాలని..



హుజూర్‌నగర్‌లో రోడ్డు వెంట వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది

'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం చేపట్టిన కేంద్రం

- గ్రామాల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా చర్యలు
- 475 పంచాయతీల్లో నిర్వహణ
- అక్టోబర్ 2 వరకు కొనసాగనున్న కార్యక్రమాలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పల్లెల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే స్వచ్ఛ పల్లెలుగా రూపుదిద్దుకుంటాయన్న మహాత్ముని మాటలను ఆచరణలోకి తెస్తూ ఆయన జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2021, అక్టోబర్ 2న పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా -2023 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 17 నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలను అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యాచరణ అమలుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో అంగన్‌వాడీలు, పాఠశాలలు తదితర ప్రజాప్రయోగ ప్రదేశాల్లో ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. చెత్తాచెదారం, కాలువల్లో పేరుకున్న మురుగును తొలగించి శుభ్రం చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పంచాయతీల్లో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లలో తడి, పొడి చెత్త వేరుచేయడంతోపాటు సేంద్రియ ఎరువులు తయారు చేయడంపై దృష్టి పెట్టనున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా అన్ని పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని తీర్మానం, ప్రతిజ్ఞ చేసేలా కార్యాచరణ రూపొందించారు. ప్లాస్టిక్‌కు బదులుగా కాగితం, వస్త్రం, జూట్ సంచులు వినియోగించేలా అవగాహన కల్పించనున్నారు.

ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు..

- ఈ నెల 17 ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ప్రతి గ్రామ పంచాయితీల్లో శ్రమదానం కార్యక్రమాలు చేపట్టారు.
- 18న పర్యావరణ హితమైన పండగలపై యువత, మహిళా సంఘాలచే సమావేశాలు నిర్వహించారు
- 19న చెత్త నిర్వహణ విధానంపై గంట పాటు బోధించడం, విద్యార్థులు, యువకులచే స్వచ్ఛ ప్రతిజ్ఞలు, ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. స్వచ్ఛ నడక, డంపింగ్ యార్డుల సందర్శించి వర్మి కంపోస్ట్ తయారీ గురించి చర్చించారు. వ్యర్థాల నిర్వహణ, ఆస్తుల రిపేరు, మరమ్మతులు, ట్రాక్టర్, ట్రాలీ, డంపింగ్ యార్డ్, మరుగుదొడ్లకు అలంకరణ చేశారు.
- 20న స్వచ్ఛతపై విద్యార్థులు, యువతకు చిత్రలేఖనం, క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన, మహిళలకు రంగోలి ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతు ప్రదానం చేశారు.
- 21 గురువారం స్వయం సహాయక మహిళాలచే ప్రత్యేక సమావేశాలు, స్వచ్ఛత సమ్మేళనాలు నిర్వహించారు. అలాగే మహిళలచే శ్రమదానం, ఇంటి వద్దనే తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు.
- 22న డ్రైడ్ ను డ్రై డేను నిర్వహించారు.
- 23న ప్రతి ప్రభుత్వ, ఇతర సంస్థల్లో శ్రమదానం చేశారు. వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా చేపడుతున్న ఉత్తమ సంస్థలను గుర్తించి సన్మానించారు. గ్రామంలో చెత్త వేసే ప్రదేశాలను గుర్తించి తొలగించడం, కళాజాతా కార్యక్రమాలచే స్వచ్ఛతపై అవగాహన కల్పించారు.
- 24న అన్ని మతాలకు చెందిన ప్రార్థన మందిరాల వద్ద శ్రమదానాలు, పరిసరాల పరిశుభ్రత, మురుగు కాలువల్లో చెత్తాచెదారం తొలగించే కార్యక్రమాలు చేపట్టారు.

కాగా అక్టోబర్ 2 వరకు చేపట్టాల్సి ఉన్న స్వచ్ఛతా హీ సేవా-2023 కార్యక్రమాల వివరాలను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు విడుదల చేయాల్సి ఉంది.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం..

అన్ని గ్రామ పంచాయతీలు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. పల్లెల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చేలా పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశాం. మొక్కుబడిగా కాకుండా ప్రత్యేక శ్రద్ధతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించాం. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలోని అన్ని పంచాయతీలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

ఇంటింటికీ 'ఆయుష్మాన్ భవ'

- ఈ నెల 17 నుంచి ప్రారంభమైన కార్యక్రమం
- వచ్చే నెల 2 వరకు ఆరోగ్య శిబిరాలు
- హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి): వైద్య సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 2 వారాల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల పరిధిలో కార్యకలాపాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు.



ఆయుష్మాన్ కార్డు నమూనా

ఇంటింటికీ కార్డుల పంపిణీ

ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి, కుటుంబ సభ్యులకు (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డును) అందిస్తున్నారు. ఈ మేరకు ఆస్పత్రుల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్డు ఉంటే దేశ వ్యాప్తంగా ఏ ప్రభుత్వ ఆస్పత్రికైనా వెళ్లి ఎలాంటి పత్రాలు లేకుండానే వైద్య సేవలు పొందవచ్చు.

పకడ్బందీగా నిర్వహిస్తున్నాం



"రెండు వారాల పాటు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. పదిహేను రోజుల్లో కార్డులు పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందించా. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కేంద్ర ప్రభుత్వం అన్ని కార్యక్రమాలు కలిపి ఆయుష్మాన్ భవ పేరుతో ఈ కార్యక్రమం చేపట్టింది."

– డాక్టర్ కళ్యాణ్, ఆయుష్మాన్ భవ జిల్లా ప్రోగ్రామ్ అధికారి

కార్యక్రమాలు ఇవీ..

ఆయుష్మాన్ ఆప్‌కే ద్వార్ 3.0 కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ కార్డులు అందిస్తారు. వారంలో ఒకరోజు ఆరోగ్య మేళా ఏర్పాటు చేయనున్నారు. వీటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మెడికల్ కళాశాలలు, ప్రాంతీయ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఇందులో గర్భిణులు, పిల్లలు, చెవి, ముక్కు, గొంతు, కన్ను, మానసిక విభాగం వంటి నిపుణులతో వైద్య పరీక్షలు చేస్తారు. అక్టోబర్ 2 నుంచి గాంధీ జయంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరాల ఏర్పాటుతో పాటు రక్తదాతల పేర్లను పోర్టల్‌లో నమోదు చేసి ఎప్పుడైనా రక్తం అవసరం ఉంటే వారికి సమాచారం అందించనున్నారు. ఈ నెల 29 తేదీలో ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య మేళా నిర్వహించనున్నారు. జిల్లాలో 23 పీహెచ్‌సీలు, 171 పల్లె దవాఖానాలు, 82 సబ్ సెంటర్ల పరిధిలో ఈ మేళాలు నిర్వహించనున్నారు.

ఆరోగ్య శిబిరాల నిర్వహణ

ఆయుష్మాన్ భవ ద్వారా జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు వైద్య నిపుణులతో పరీక్షలు చేయిస్తున్నారు. వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ జరిగితే వారికి ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ఉచితంగా చికిత్స, మందులు అందించడంపై అధికారులు దృష్టి సారించారు. గ్రామాల్లో ఆయుష్మాన్ సభలు నిర్వహించి, వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

అవయవ దానంపై అవగాహన

ఆయుష్మాన్ భవలో భాగంగా ప్రజలకు అవయవ దానం ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు ముఖ్యంగా యువకులతో అవయవ దానంపై ప్రతిజ్ఞ చేయించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్, కామెర్లు తదితర అన్ని రకాల జీవన శైలికి సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన తగిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లి కారు బోల్తా



హైవే వెంట పొలాల్లో బోల్తాపడిన కారు

అర్వపల్లి: నకిరేకల్–తానంచర్ల 365 జాతీయ రహదారిపై ఆదివారం ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి జాజిరెడ్డిగూడెం మీదుగా మద్దిరాలకు వెళ్తున్న కారు అర్వపల్లి శివారులో అదుపుతప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తి వాహనంలో నుంచి దూకి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బోల్తా పడిన కారును స్థానికులు ట్రాక్టర్‌తో బయటికి తీశారు. 365, 365బీ హైవేలపై తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవా లని పలువురు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

అడ్డగూడూరు : పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన అడ్డగూగూరు మండలంలో ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుండాల మండలం బండ కొత్తపల్లి గ్రామానికి చెందిన ననుబాల యాదగిరి కూతురు మంజుల(32)కు అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన ననూబోతు మహేష్‌తో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. బండకొత్తపల్లికి చెందిన మంజుల తమ్ముడు భిక్షంకు జానకీపురం గ్రామానికి చెందిన అనూషతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. మహేష్, మంజుల మధ్యవర్తిత్వం వహించి వీరి వివాహం జరిపించారు. అయితే, కొంతకాలంగా భిక్షం, అనూష దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో అనూష పుట్టింటికి వచ్చింది. అనూష కుటుంబ సభ్యులు భిక్షం తీరుపై మహేష్, మంజులను నిలదీశారు. భిక్షం వైఖరి కారణంగా మహేష్, మంజుల కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన మంజుల శనివారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలో పడి ఉన్న మంజులను కొద్ది సేపటి తర్వాత భర్త గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

రహస్యంగా మృతదేహం పూడ్చివేత

మృతదేహాన్ని బ్యాగులో కుక్కి.. కారులో తీసుకొచ్చి..

- అర్ధరాత్రి నల్లగొండ శివారు ఉదయ సముద్రం రిజర్వాయర్ ఎగువభాగాన అంతిమ సంస్కారాలు
- గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేయడంపై అనుమానాలు

నల్లగొండ క్రైం : దుండగులు అర్ధరాత్రి ఓ మృతదేహానికి రహస్యంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన నీలగిరి మున్సిపాలిటీ పరిధి చందనపల్లి శివారు చెత్త డంపింగ్ యార్డు సమీపంలో పానగల్ ఉదయ సముద్రం ఎగువ ప్రాంతంలో జరిగింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి 11:30 గంటలకు కారులో నలుగురు, మూడు బైక్‌లపై మరో ఆరుగురు వ్యక్తులు చందనపల్లి చెత్తడంపింగ్ యార్డు సమీపంలోని పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్ ఎగువ ప్రాంతానికి వచ్చారు.



మృతదేహాన్ని ఖననం చేసిన ప్రదేశం

వాహనాలను అక్కడే నిలిపి తమ వెంట తెచ్చుకున్న పలుగు, పారలతో సుమారు 4 నుంచి 5 ఫీట్ల పొడవులో గొయ్యి తీశారు. ప్యాకెట్లలో తీసుకొచ్చిన ఉప్పు గొయ్యిలో పోశారు. అనంతరం బ్యాగులో కుక్కి కారులో తీసుకొచ్చిన మృతదేహాన్ని బయటికి తీశారు. ఇద్దరు వ్యక్తులు సదరు మృతదేహం కాళ్లు ఒకరు, చేతులు మరొకరు పట్టుకుని గోతిలో పెట్టి పూడ్చిపెట్టారు. ఈ క్రమంలో వెంట వచ్చిన ఒకరు పెద్ద పెట్టున రోదించగా మిగతా వారు అతడిని వారించారు. అంతిమ సంస్కారాలు ముగిసిన తర్వాత అందరూ ఆయా వాహనాల్లో అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిసింది.

ఆ.. మృతదేహం ఎవరిది?

గుర్తుతెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేసిన మృతదేహం ఎవరిదనేది చందనపల్లి గ్రామంలో చర్చ జరుగుతోంది. గొయ్యి పొడవు 4 నుంచి 5 ఫీట్ల లోపే ఉండడంతో ఆ మృతదేహం 6 నుంచి ఏడేళ్ల లోపు వారిదే ఉంటుందని తెలుస్తోంది. మృతదేహం ఆడ, మగ అనేది స్పష్టత లేదని అర్ధరాత్రి చాటుగా గమనించిన వారు పేర్కొంటున్నారు. ఏదైనా అనారోగ్యంతో మృతిచెందితే నిర్భయంగా అంత్యక్రియలు చేస్తారు. మహిళలు ఎవరు లేకుండా, అర్ధరాత్రి బ్యాగులో మృతదేహాన్ని తీసుకొచ్చి ఖననం చేయడంతో ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకొచ్చి పూడ్చిపెట్టారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం అష్టమి కావడంతో నరబలి ఇచ్చిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తీసుకొచ్చి పూడ్చిపెట్టారనే అనుమానాలు లేకపోలేదు. అర్ధరాత్రి అంతిమ సంస్కారాల తంతును గమనించిన కొందరు చందనపల్లి గ్రామస్తులకు విషయం తెలపడంతో చర్చనీయాంశంగా మారింది.

ఆదర్శ యువజన మండలి ఆధ్వర్యంలో..

- మాసాయిపేటలో 48ఏళ్లుగా గణేశ్ నవరాత్రి వేడుకలు



మాసాయిపేటలో గణేశ్ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో ఆదర్శ యువజన మండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో 48 ఏళ్ల నుంచి గణేశ్ నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 1975 సంవత్సరంలో 400 మందితో సుభాష్ యూత్ పేరుతో సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1998లో ఆదర్శ యువజన మండలిగా పేరు మార్చారు. గ్రామంలో ఒక్కటే వినాయకుని మండపం ఉండడంతో అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకునేవారు. 2000 సంవత్సరంలో కొంత మంది వేరుకావడంతో ప్రస్తుతం 200మంది సభ్యులతో ఆదర్శ యువజన మండలి ముందుకు కొనసాగుతోంది.

సేవా కార్యక్రమాలు

మాసాయిపేట గ్రామంలో 1990కి ముందు వినాయకుని మండపం వద్ద నాటకాలు వేయించేవారు. అదేవిధంగా పిల్లలకు ప్రత్యేకమైన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. దీంతో పాటు గ్రామంలో క్లబ్ తరఫున సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పాఠశాలలో కావాల్సిన వసతులు తెలుసుకుని సహాయం చేసేవారు.

సేవా కార్యక్రమాలు చేస్తాం



ఆదర్శ యువజన మండలి యూత్ తరఫున సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. 2000 –05 వరకు అధ్యక్షుడిగా పనిచేసాను. పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సేవాల కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాం.

– ఇరిటెపు శ్రీనివాస్, యూత్ కన్వీనర్

ఆదర్శంగా ఉంటాం



మా యూత్ ద్వారా వినాయక మండపాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తూ, ఇతరులకు ఆదర్శంగా ఉంటున్నాం. అందరికంటే భిన్నంగా, కల్చరల్, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతాము. గ్రామస్తుల నుంచి సహకారం లభిస్తుంది.

– కటకం శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు

పీఏపల్లిలో పట్టపగలే చోరీ

- రూ.5లక్షల నగదు, 5తులాల బంగారం అపహరణ

పెద్దఅడిశర్లపల్లి: పట్టపగలే దుండగులు తెగబడ్డారు. తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ.5లక్షల నగదుతో పాటు ఐదు తులాల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. పెద్ద అడిశర్లపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పీఏపల్లికి చెందిన వంగాల లక్ష్మారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మారెడ్డి తన బంధువులను పరామర్శించేందుకు ఆదివారం ఉదయం 9గంటలకు ఇంటికి తాళం వేసి తన భార్యతో కలసి నేరేడుచర్లకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉండడంతో పాటు వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, కొండమల్లేపల్లి సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. లక్ష్మారెడ్డి తన కుమారుడి విదేశీ విద్య నిమిత్తం బీరువాలో దాచిన రూ.5లక్షలతో పాటు ఐదు తులాల బంగారు ఆభరణాలను దుండగులు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ గిరిబాబు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన కర్ణకంటి రవీందర్(50) కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భువనగిరి మండలంలోని పగిడిపల్లి గ్రామంలో శనివారం కార్పెంటర్ పనికి వెళ్లాడు. సాయంత్రం పని ముగించుకుని భువనగిరికి వచ్చేందుకు పగిడిపల్లిలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.



రవీందర్ (ఫైల్)

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యం వాహనంతో పోలీసులు

నాగారం : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం ఫణిగిరి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని చందులాల్ తండాకు చెందిన దేవుసోత్ రెడ్యా, పచ్చలబోడు తండాకు చెందిన గుగులోతు అనిల్ నాగారం మండలంలోని వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. ఆ బియ్యాన్ని టాటాఏస్ వాహనంలో హైదరాబాద్ వైపు తరలిస్తుండగా ఫణిగిరి స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని, టాటాఏస్ వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



బుద్ధుని పాదాల చెంత పుష్పాంజలి ఘటిస్తున్న బౌద్ధులు

నాగార్జునసాగర్ : అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి పర్యాటకులతోపాటు మహారాష్ట్రలోని పూణే నుంచి బౌద్ధులు వచ్చారు. వీరు బుద్ధవనంలోని బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటించారు. జాతక కథల పార్కు, స్థూపపార్కు, శ్రీలంక దేశీయులు ఏర్పాటు చేసిన 40 అడుగుల బుద్ధుడు, తపోవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్థూపంపై చెక్కిన శిల్పాలను, మహాస్థూపం రెండవ అంతస్తులో గల అష్ట బుద్ధులను సందర్శించారు. అనంతరం లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంలోగల బుద్ధుడి చరిత్రకు సంబంధించిన విగ్రహాలతో పాటు చైత్యాలు, మహాబోధి వృక్షం తదితర ప్రాంతాలను సందర్శించారు. వీరికి పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ బుద్ధుని గురించి వివరించారు.

అంగన్‌వాడీలపై కక్ష సాధింపు సరికాదు



సమ్మెకు మద్దతు పలికి మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ రెడ్డి

మునుగోడు, చండూరు: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పోరాడుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోగా.. వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మునుగోడు, చండూరులో అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె శిబిరాలను ఆయన సందర్శించి మాట్లాడారు. స్వచ్ఛంద సేవకుల్లా ఎన్నో రకాల పనులు చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాల డిమాండ్ చేశారు. బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నలపరాజు సతీష్‌కుమార్, చాపల శీను, దొటి వెంకన్న, బండమీది వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు కేదారి, సునీత, రాధిక, రాజేశ్వరి, శోభ, తారక, జోతి, జగదీశ్వరి, నాగమణి, రమణమ్మ, శారద, జంగమ్మ, పార్వతమ్మ, ఉష, వనజ, అన్నపూర్ణ, లలిత, రాధిక, పారిజాత, ప్రమీల, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కూల్‌డ్రింక్స్ గోదాం దగ్ధం

- రూ.75 లక్షల ఆస్తినష్టం

చివ్వెంల(సూర్యాపేట) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కూల్‌డ్రింక్స్ గోదాం దగ్ధమైంది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...బీబీగూడెం శివారులోని అక్షిత ట్రేడర్స్ కూల్‌డ్రింక్స్ గోదాంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు సూర్యాపేటలో ఉంటున్న యాజమాని జగన్‌మోహన్‌రెడ్డికి సమాచారం అందించారు. విషయం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు చల్లార్చారు. అప్పటికే గోదాములో ఉన్న కూల్‌డ్రింక్స్‌తో పాటు గోదాము దగ్ధమైందని యాజమాని తెలిపాడు. ఈ ప్రమాదంలో రూ.75 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు వాపోయాడు. గోదాం యాజమాని జగన్‌మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

గణేశ్ నవరాత్రి వేడుకల్లో విషాదం

- విద్యుదాఘాతంతో ఏడేళ్ల బాలుడు మృతి
- తుర్కపల్లి మండల పరిధిలో ఘటన

తుర్కపల్లి: గణేశ్ నవరాత్రి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. ఏకదంతుడికి పూజలు నిర్వహించేందుకు తల్లిదండ్రులతో కలసి వెళ్లిన ఏడేళ్ల బాలుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం దత్తాయపల్లికి చెందిన జిట్టా రాజు, మహాలక్ష్మీ దంపతులు తమ కుమారుడు ఆదిత్య (7), కూతురితో కలసి గ్రామంలో ప్రతిష్టించిన గణేశ్ విగ్రహానికి పూజలు నిర్వహించేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. తల్లిదండ్రులు మండపం వద్ద ఉండగా ఆదిత్య, దాని ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లాడు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఇనుపచువ్వలు పట్టుకుని ఎక్కేందుకు ప్రయత్నించాడు. అప్పటికే ఆ ఇనుప చువ్వలకు గణేశ్ మండపానికి విద్యుత్ సరఫరా అవుతున్న వైరు తగిలి ఉంది. ఆదిత్య ఆ చువ్వలను పట్టుకోగానే విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదిత్య మృతితో దత్తాయపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది.



ఆదిత్య మృతదేహం

న్యాయపరమైన అడ్డంకులను తొలగించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

సూర్యాపేటటౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి న్యాయపరమైన అడ్డంకులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య డిమాండ్ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జలగం కవిత కుటుంబానికి ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం కుటుంబ సంక్షేమ నిధి ద్వారా రూ.6లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీజోన్–2 బదిలీలు, పదోన్నతుల విషయంలో ఏర్పడిన న్యాయపరమైన అడ్డంకులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి షెడ్యూల్ ప్రకారం బదిలీలు, పదోన్నతులు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు, ఎం. వెంకన్న, సీహెచ్. రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, కొండయ్య, ఎస్. మహేష్, సోమయ్య, అనిల్‌కుమార్, యాకయ్య, అరుణభారతి, వెంకటయ్య, పాపిరెడ్డి, రమేష ఆడం తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

కోదాడరూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మచ్చ రామకృష్ణ సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేట్ పరం చేసేందుకు నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో 22వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 5086 ఖాళీలకు మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం రామకృష్ణ కుటుంబ సభ్యులకు రూ.6లక్షల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎం. రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి నాగమణి, జిల్లా అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కేఏ. మంగ, పి. శ్రీనివాసరెడ్డి, ఆర్. ధనమూర్తి, కొండయ్య, మహేష్ తదితరులు ఉన్నారు.



సూర్యాపేటటౌన్: కవిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

- కేటీఆర్‌కు వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు జేవీఆర్ వినతి



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు జేవీఆర్

హుజూర్‌నగర్: నాగార్జునసాగర్ ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేయాలని వైఎస్సార్ టీపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కోరారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం, వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువ చివరి ప్రాంతంలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రైతుల పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదనవ్యక్తం చేశారు. రైతులు నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నందున సాగు, తాగు నీటిని అందించాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫణిగిరి గుట్ట వద్ద ఉన్న అసంపూర్తి ఇళ్లను వెంటనే పూర్తి చేయించి అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. వీటిపై మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు జేవీఆర్ వివరించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

భువనగిరి: గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ అన్నారు. చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు వైద్యం కార్యక్రమంలో భాగంగా 100వ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన సందర్భంగా ఆదివారం భువనగిరి పట్టణ శివారులోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో వైద్యరంగానికి 1.2 శాతం మాత్రమే ఖర్చు చేస్తుండగా.. అభివృద్ధి చెందిన దేశాల్లో 10 శాతం ఖర్చు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు వైద్య రంగానికి ఎక్కువ నిధులు కేటాయిస్తే వైద్య రంగంలో మంచి ఫలితాలు సాధించవచ్చాన్నారు. కార్యక్రమంలో చావా ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు డాక్టర్ తిరునగరి రంగయ్య, విజయ్‌భార్గవ్, సద్ది వెంకట్‌రెడ్డి, దిడ్డి బాలాజీ, బండారు రాంమోహన్‌రావు, జడ్డి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వరిలో ఆకు ఎండు తెగులు

- రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు



డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం : ఉమ్మడి జిల్లాలో బోర్లు, బావులు, ఇతర సాగు నీటి వనరుల ద్వార సాగు చేసిన వరి పంటకు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా బ్యాక్టీరియా సోకడంతో ఆకు ఎండు తెగులు ఆశించింది. ఈ తెగులు నివారణకు రైతులు తక్షణమే యాజ మాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగాం కోఆర్డి నేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచిస్తున్నారు.

తెగులు సోకడానికి కారణాలు

సెప్టెంబర్–అక్టోబర్ నెలలో మబ్బులతో కూడిన వాతావరణం, రెండు నుంచి మూడు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసే వర్షాలు, తక్కువ ఉష్ణోగ్రతలు తదితర పరిస్థితులు వరిలో ఆకు ఎండు తెగులు ఆశించడానికి దోహదం చేస్తాయి. నారు మడి దశ నుంచి గింజ పాలు పోసుకునే వరకు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. చెట్టు నీడ పడే ప్రదేశంలో ఎక్కువగా ఆకు ఎండు తెగులు ఆశించి మిగిలిన పంటకు వేగంగా వ్యాపిస్తుంది.



త్రిపురారం : ఆకు ఎండు తెగులు సోకిన వరి పాలం

పాడి పంట

నివారణ చర్యలు

బ్యాక్టీరియా వ్యాప్తి నివారణకు తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన పంటకు నీరు పారకుండా చూసుకోవాలి. తెగులు ఆశించిన పొలంలో నత్రజని వేయకూడదు. కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 4 గ్రాములు (లేదా) పోషామైసిన్ (లేదా) స్ట్రెప్టోసైక్లిన్ 4 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి 2 నుంచి 3 సార్లు వారం వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.

తెగులును గుర్తించే విధానం

వరి పంటలో ఆకు ఎండు తెగులు సోకిన ప్రదేశంలో ముందుగా ముదురు ఆకులకు పసుపు రంగు మచ్చలు ఏర్పడి పైనుంచి కింది అంచుల వెంబడి వ్యాపించి ఎండుతూ వస్తాయి. ఉదయం సమయంలో గమనిస్తే ఆకుల మీద పసుపు రంగు జిగురు ముద్దలు కనబడతాయి. ఎండ వేడిమికి గట్టిపడి రాలిపోతాయి. ఈ ఎండిన బాక్టీరియా ముద్దలు నీటి ద్వారా వెళ్లి మిగిలిన పంటకు వ్యాపిస్తుంది.